సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 19 । మార్చి । 2023



జలమండలికి మరో అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిని మరో అవార్డు వరించింది. యునెస్కో, కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ సంయుక్తాధ్వర్యంలో.. వాటర్ డైజెస్ట్ మ్యాగజైన్ జాతీయ స్థాయిలో 2022-23 సంవత్సరానికి 65 కేటగిరీల్లో నిర్వహించిన వరల్డ్ వాటర్ అవార్డుల్లో జలమండలికి ఉత్తమ ఎస్టీపీ పురస్కారం లభించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు అవార్డు అందుకున్నారు.

అమెరికన్ కాన్సులేట్‌కు సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: కోఠి, సీబీఎస్‌ల నుంచి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్‌కు సిటీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ జి.వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు కోఠి నుంచి బయలుదేరి మెహిదీపట్నం, టోలీచౌకి, దర్గా, నానక్‌రాంగూడ, క్యూ సిటీ, అమెరికన్ కాన్సులేట్ వరకు రాకపోకలు సాగించనున్నాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం

డీఈఓ సుశీందర్‌రావు

కొందుర్గు: విద్యార్థులు చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకమని డీఈఓ సుశీందర్‌రావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ పరిశీలనలో భాగంగా శనివారం ఆయన కొందుర్గు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొందుర్గు బాలుర ప్రాథమిక పాఠశాల, దళితవాడ పాఠశాలతోపాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశానికి హాజరైన తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు తీసుకునే జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందా అని ఆరా తీశారు. విద్యాబోధన, భోజనం బాగున్నా యని తల్లిదండ్రులు సమాధానమిచ్చారు.అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ కిష్టారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు కమ్మదనం గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత శనివారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని, గురుకులాల రాష్ట్ర కార్యదర్శి రొనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు ఈనెల 16 వరకు ఉన్న గడువును 20 వరకు పొడిగించినట్లు చెప్పారు. విద్యార్థులు టీజీ సెట్-2023 ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలకు మించరాదన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

శంకర్‌పల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, పేద ప్రజలు బతికే పరిస్థితి లేకుండా చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు అన్నారు. శంకర్‌పల్లిలో శనివారం మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి.. అదానీ లాంటి వారి కి ఆస్తులు సంపాదించి పెడుతోందని ఆరోపించారు. మోదీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయినా ప్రజా ఆదాయం పెరగలేదని, కార్పొరేట్ సంస్థల ఆదాయం మాత్రం పెరుగుతోందన్నారు. వచ్చేనెల 5న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యద్శి జగన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి, డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట కార్పొరేషన్‌కు నిధులు మంజూరు

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.3.30 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌సీఐ రోడ్డు నుంచి డీఎస్ఆర్ కాలనీ, లలితానగర్, నందనవనం వరకు రోడ్డు విస్తరణకు రూ.1.20 కోట్లు, రాఘవేంద్రనగర్ నుంచి న్యూగాయత్రీనగర్ వరకు రోడ్డు వెడల్పు కోసం రూ.65 లక్షలు, అంబేడ్కర్ విగ్రహం నుంచి గాయత్రీనగర్ వరకు రోడ్డు విస్తరణ కోసం రూ.60 లక్షలు, ఆటోస్టాండ్ నుంచి పోస్ట్‌బాక్స్, మీర్‌పేట లైబ్రరీ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి కోసం రూ.85 లక్షలు మంజూరైట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.



మొయినాబాద్: చిలుకూరులో టమాటా చేనులో నిలిచిన వర్షం నీరు, (ఇన్‌సెట్) సజ్జన్‌పల్లిలో విరిగి పడిన బొప్పాయి చెట్లు

'అకాల' నష్టం

వడగళ్లు మిగిల్చిన కడగళ్లు

- దెబ్బతిన్న పూలు, పండ్లు, కూరగాయల తోటలు
- భారీగా పంట నష్టం
- అంచనా వేసే పనిలో అధికారులు
- ఆందోళనలో రైతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/మొయినాబాద్: ఆరుగాలం కష్టం చేసి పంటలు పండిస్తున్న రైతులను అకాల వర్షాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వానలు అపార నష్టాన్ని మిగిల్చాయి. చేతికి అందివచ్చిన మామిడి సహా పూలు, పండ్లు, టమాటా వంటి కాయగూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట చేలల్లోనే నేలవాలడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు వడగళ్లకు అనేక ఇళ్ల రేకులు ధ్వంసమయ్యాయి. ఇంటి పైకప్పులు కూలి పలువురు గాయపడ్డారు. కోళ్ల ఫారాల్లోని కోడి పిల్లలు మృత్యువాతపడ్డాయి.

వందల ఎకరాల్లో పంట నష్టం

- యాచారం మండలం మొండిగౌరెల్లి, నల్లవెల్లి, సుల్తాన్‌పూర్, చింతపట్ల గ్రామాల్లో 377 ఎకరాల్లో వరిపంట దెబ్బతినగా, మరో 30 ఎకరాల్లో టమోటా, 10 ఎకరాల మామిడి తోట దెబ్బతింది.
- మంచాల మండలం బోడకొండ, శ్రీమంతుగూడ, లోయపల్లి, చీదేడ్, దాడుపల్లి గ్రామాల్లో 410 ఎకరాల వరికి నష్టం వాటిల్లింది.
- ఆమనగల్లు మండలంలో 10 ఎకరాల ఆముదం, కొండాపూర్‌లో 12 ఎకరాల మామిడి పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ప్రాథమిక నివేదిక పంపారు.
- మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో పంటచేలల్లో నీళ్లు నిలిచాయి. వడగళ్లతో కొమ్మలు, కాయలు, ఆకులు రాలిపోయాయి. సుమారు 200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం పంట నష్టం భారీగా జరిగినట్లు రైతులు చెబుతున్నారు.
- మొయినాబాద్ మండలంలోని చిలుకూరు, పెద్దమంగళారం, చందానగర్, రెడ్డిపల్లి, మేడిపల్లి, కనకమామిడి, తోలుకట్ట, నక్కలపల్లి, శ్రీరాంనగర్, సురంగల్ తదితర గ్రామాల్లో కూరగాయలు, పూలతోటలు, ఆకుకూరలు అధికంగా సాగుచేశారు. ఆయా గ్రామాల్లోని పంటలన్నీ భారీగా దెబ్బతిన్నాయి. కూరగాయల చెట్లు విరిగిపడ్డాయి. పూలతోటలు నేలకొరిగి పూలన్నీ దెబ్బతిన్నాయి. ఆకుకూరలు పాడయ్యాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. బొప్పాయి చెట్లు నేలకొరిగాయి.

విరిగిపడిన చెట్లు..

భారీ ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షానికి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చాలాచోట్ల చెట్లు నేలకొరిగాయి. మొయినాబాద్ మండలంలోని భాస్కర ఆస్పత్రి ఎదుట, స్వామినారాయణ గురుకుల్, సుజాత స్కూల్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లు నేలకొరిగాయి. చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లోని చాలా గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పరామర్శలే తప్ప పరిహారం కరువు

ఈదురు గాలులు మిల్చిన నష్టాన్ని అంచనా వేసేందుకు మంత్రి సబితారెడ్డి సహా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తున్నారు. ఆర్థిక సాయం చేసే అంశాన్ని ప్రస్తావించకుండా పరామర్శలతోనే సరిపెడుతుండటంతో బాధితులు, ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మళ్లీ కురిసిన వర్షం

ఇదిలా ఉంటే శనివారం సాయంత్రం కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు చోట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో ఫీడర్లు ట్రిప్పై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు కొన్ని చోట్ల వెంటనే సరఫరాను పునరుద్ధరించినా మెజార్టీ ప్రాంతాల్లో అర్ధరాత్రి తర్వాత కూడా అంధకారం తప్పలేదు.

నష్ట పరిహారం ఇవ్వాలి



అకాల వర్షం తీవ్ర నష్టానికి గురిచేసింది. వడగళ్లు పడడంతో చేమంతి, గులాబీ తోటల్లో పూలన్నీ రాలిపోయాయి. టమాటా చెట్లు విరిగిపోయాయి. చేలల్లో నీళ్లు నిలవడంతో పంట చేతికి వచ్చే అవకాశం కూడా లేదు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే వర్షం అంతా ఊడ్చేసింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– సంగెరి శ్రీశైలం, రైతు, చిలుకూరు

నష్టం అంచనా వేస్తున్నాం

రెండు రోజులుగా కురిసిన వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. టమాటా, వంకాయ, పూల తోటలు, ఆకుకూరలు, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నాం. నష్టం ఎంత జరిగిందనేది అంచనా వేస్తున్నాం. ఇప్పటి వరకు డివిజన్‌లో సుమారు 200 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు అంచనా వేశాం.

– అశోక్, ఉద్యాన శాఖ అధికారి, చేవెళ్ల

శంకర్‌పల్లిలో వడగళ్ల వాన



శంకర్‌పల్లి: మండంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. పట్టణ కేంద్రంతో పాటు, మున్సిపల్ పరిధిలోని సింగాపురం, బుల్కాపురం, మోకిల, కొండకల్ ప్రొద్దటూరు, మహరాజ్‌పేట్, గోపులారం, పిల్లిగుండ్ల గ్రామాల్లో అరగంట పాటు వర్షం కురిసింది. భారీ సైజులో వడగళ్లు పడ్డాయి.

రైతును ముంచిన రాళ్ల వాన

వికారాబాద్ జిల్లాలోని పలు చోట్ల శనివారం కురిసిన వడగళ్ల వాన రైతులకు తీరని నష్టం కలిగించింది. వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం, తాండూరు, యాలాల, కుల్కచర్ల మండలాల్లో సాగు చేసిన కూరగాయ, మామిడి పంటలు ధ్వంసమయ్యాయి. ఈదురు గాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పలు రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పలుచోట్ల పశువులు మృతిచెందాయి.



అనంతగిరి: మదన్‌పల్లిలో నేలకొరిగిన మామిడి చెట్లు

నాయకత్వ లక్షణాలు అవసరం

సింబాయాసిస్ లా కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్



జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభిస్తున్న సినీతారలు

నందిగామ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సింబాయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం లా కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్ అన్నారు. మండల పరిధిలోని మోదల్లగూడ శివారులోని సింబాయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలో శనివారం సెమినార్-2023 (వార్షికోత్సవం) నిర్వహించారు. ప్రముఖ సినీతారలు కావ్య కళ్యాణ్ రామ్, సిమ్రాన్ చౌదరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ ఆగావ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నాయకత్వ లక్షణాలపై దృష్టి సారించాలన్నారు. న్యాయశాస్త్ర విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను నిశితంగా గమనించాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో న్యాయ నిపుణు లుగా ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్న సింబాయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఎంతో అద్భుతంగా ఉందని సినీ తారలు కావ్య కళ్యాణ్ రామ్, సిమ్రాన్ చౌదరి అన్నారు. అమ్మాయిలు అబ్బాయిలతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డిప్యూటీ డైరెక్టర్ శ్యాంసుందర్, క్యాంపస్ అడ్మిన్ సీవీ మోహన్, స్టూడెంట్స్ కౌన్సిల్ సభ్యులు, విద్యార్థులు, కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

త్వరలో 'పాలమూరు-రంగారెడ్డి' పూర్తి

జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ రమణ



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

షాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను త్వరలో పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నాని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎల్.రమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని బొబ్బిలిగామలో శనివారం పది పంచాయతీల ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు తరహాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేసి రైతులకు సాగు నీరు పుష్కలంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, పార్టీ సీనియర్ నాయకులు జడల రాజేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, పాండు, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు అర్చన, కేతన జయమ్మ, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, దర్శన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, షబ్బీర్, ప్రభాకర్, రంగారెడ్డి, ప్రశాంత్, ఈదుల కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'స్వప్నలోక్'ను పరిశీలించిన జేఎన్‌టీయూ నిపుణులు



స్వప్నలోక్ కాంప్లెక్స్ వద్ద జేఎన్‌టీయూ బృందం

రాంగోపాల్‌పేట్/కేపీహెచ్‌బీకాలనీ: అగ్ని ప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను శనివారం జేఎన్‌టీయూ హెచ్‌ఓడీ డీఎన్ కుమార్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎన్ కుమార్ మాట్లాడుతూ.. కాంప్లెక్స్ ఐదో అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగినప్పటికీ మంటల తీవ్రతతో నాలుగు, ఆరు అంతస్తులు కూడా దెబ్బతిన్నాయన్నారు. బిల్డింగ్స్‌లోని కాలమ్స్, బీమ్స్, స్లాబ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం నివేదిక ఇస్తామని చెప్పారు. అనంతరం భవనాన్ని కూల్చివేయాలా లేక మరమ్మతులు చేయాలా అనే విషయంపై స్పష్టత వస్తుందన్నారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు మరో రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు?

స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఐదో అంతస్తులోని కేడియా ఇన్ఫోటెక్, క్యూనెట్‌లకు చెందిన ముగ్గురిని మహంకాళి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. క్యూనెట్‌కు ఇండియాలో అనుబంధంగా కొనసాగుతున్న విహాన్ అనే సంస్థకు చెందిన భాను, శివతో పాటు కేడియా ఇన్ఫోటెక్‌కు చెందిన యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. స్వప్నలోక్-సూర్యకిరణ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేషన్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఐదారేళ్ల నుంచి మెయింటెనెన్స్ చూస్తున్నా ఇప్పటి వరకు ఫైర్ సేఫ్టీ తర్వాత అత్యవసర ద్వారాలు మూసివేసినా పట్టించుకోకుండా ఉండటం, నిర్వహణ పూర్తిగా వదిలి వేయడంతో ప్రమాదం జరుగడానికి వీరు కూడా ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. త్వరలోనే విచారణ పూర్తి చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు. కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీ అధికారులు మూసివేసి లోనికి ఎవరినీ అనుమతించడంలేదు. భవన పటిష్టతపై నివేదిక వచ్చాక నిపుణుల సూచనల మేరకు అనుమతించాలని అధికారులు భావిస్తున్నారు. జేఎన్‌టీయూ ప్రతినిధులు మరో రెండు రోజులు భవనాన్ని పరిశీలించనున్నారు.

కేబుల్ 'ఫాల్ట్'



- విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లపైనే
- అయినా చిన్నపాటి ఈదురు గాలికే తెగిపడుతున్న తీగలు
- ఏబీ కేబుళ్లు, కవర్ కండక్టర్ల నాణ్యతపై అనుమానాలు

సాక్షి, సిటీబ్యూరో: కాలనీల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. మూడు నెలలకోసారి లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతున్నా విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు వేలాడుతూనే ఉన్నాయి. ఈదురుగాలితో కూడిన వర్షానికి విరిగిపడుతూనే ఉన్నాయి. 11 కేవీ హెచ్‌టీ, ఎల్‌టీ కండక్టర్లు, ఏబీ కేబుళ్లు తెగిపడుతుండటంతో పాటు కొమ్మల బరువుకు కండక్టర్‌కు అటు ఇటుగా ఉన్న కరెంట్ స్తంభాలు సైతం నేల కూలుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో ఏబీ కవర్ కండక్టర్ కేబుల్ తెగిపడటం, సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోకపోవడం.. ఉదయాన్నే పార్కులో వాకింగ్ కోసం వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడటాన్ని నిశితంగా పరిశీలిస్తే.. కవర్ కండక్టర్ల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కండక్టర్లు తెగిపడినప్పుడు భూమికి ఆనుకోవడంతో ఎర్తింగ్ వచ్చి ఈఎల్ ట్రిప్పవుతోంది. అదే ఫేజ్ టు ఫేజ్ ఎర్తింగ్ అయితే.. ఓఎల్ ట్రిప్పవుతుంది. దీంతో సరఫరా నిలిచిపోయి.. విద్యుత్ ప్రమాదాలు వాటిల్లకుండా నివారిస్తుంది. ఈ ఘటనలో ఇవేవీ చోటుచేసుకోకపోవడం గమనార్హం.

చెట్ల మధ్యన కవర్ కండక్టర్లు

మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఏటా ఈదురు గాలులతో కూడిన వర్షాలు సృష్టించే బీభత్సం అంతా ఇంతా ఉండదు. సరూర్‌నగర్, హబ్సిగూడ, రామంతాపూర్, రాజేంద్రనగర్, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, ఆస్మాన్‌గఢ్ డివిజన్ల పరిధిలో చెట్ల సమస్య ఎక్కువగా ఉంది. ఈదురు గాలితో కూడిన వర్షం కురిసిన ప్రతిసారీ చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతుండటం, వైర్లు తెగిపడుతుండటం, స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలుతుండటం పరిపాటిగా మారింది. సంస్థకు ఆర్థికంగా నష్టాలను తెచ్చిపెడుతుండటంతో పాటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ.. వినియోగదారుల ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టాలని డిస్కం భావించింది. సమస్యాత్మాక ప్రాంతాల్లో అత్యాధునిక ఏబీ పవర్ కండక్టర్ కేబుళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆ మేరకు హైరిస్క్ ఏరియాల్లో ఏర్పాటు చేసింది.

ప్రశ్నార్థకంగా కేబుళ్ల నాణ్యత

సాధారణ కండక్టర్‌పై చెట్ల కొమ్మలు పడితే.. షార్ట్‌సర్క్యూట్ తలెత్తి.. వాటి నుంచి వెలువడే స్పార్క్‌లకు వైర్లు తెగిపడే అవకాశం ఉంది. కానీ కవర్ కండక్టర్ కేబుళ్లకు ఆ అవకాశమే లేదు. ఒకవేళ వాటిపై బలమైన కొమ్మలు పడినప్పుడు ఆ బరువుకు కేబుల్ సహా అటు ఇటుగా ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా నేల కూలాలి. పద్మారావు పార్కు ఘటనను పరిశీలిస్తే ఇవేవీ చోటు చేసుకోలేదు. పవర్ కండక్టర్లు తెగిపడటాన్ని పరిశీలిస్తే వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కండక్టర్ తెగిపడినప్పుడు వెంటనే ఫీడర్ ట్రిప్పై.. ఆ లైనుకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తెగిపడినది కవర్ కండక్టర్ కావడం.. ఎర్తింగ్ సమస్య లేకపోవడంతోనే ఫీడర్ ట్రిప్ కాకపోవడానికి కారణమని ఇంజినీర్లు చెబుతుండటం అనుమానాస్పదంగా ఉంది. కవర్ కండక్టర్ నాణ్యత, లైన్ల నిర్వహణ లోపాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే ఇందుకు ఇతర అంశాలను సాకుగా చూపుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

నాణ్యతపై ఆందోళన వద్దు..

మొదటిసారి వర్షానికి సాంకేతిక సమస్యలు సాధారణమే. ఒకటి రెండు వరుస వర్షాల తర్వాత పరిస్థితి మెరుగుపడుతుంది. కేబుళ్ల నాణ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని పరిశీలించిన తర్వాతే అనుమతిచ్చాం. బరువైన చెట్ల కొమ్మలు పడటం వల్లే తెగిపడుతున్నాయి. కవర్ కండక్టర్లు తెగి పడినప్పటికీ.. భూమికి ఆనుకోకపోవడంతో కాలేదు. ఫీడర్ ట్రిప్ కాక పోవడానికి ఇదే కారణం.

– శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్, ఆపరేషన్స్ విభాగం, సీపీడీసీఎల్

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు డాక్టరేట్

ఇబ్రహీంపట్నం రూరల్: పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌కు డాక్టరేట్ వరించింది. ఓరియంటల్ యూనివర్సిటీ ఇండోర్‌లో 'స్టడీ ఆఫ్ కన్స్యూమర్ బయ్యింగ్ బిహేవియర్ ఫర్ ఆన్‌లైన్ గ్రోసరీస్ షాపింగ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ వారు ఈ నెల 17న డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

తలకొండపల్లి: కృత్రిమ ఇసుక తయారు చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కృష్ణ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. పక్కా సమాచారం మేరకు కృత్రిమ ఇసుక ఫిల్టర్‌లపై దాడులు నిర్వహించారు. మూడు ఇసుక ఫిల్టర్లను జేసీబీతో ధ్వంసం చేసి నేలమట్టం చేశారు. ఫిల్టర్లు నిర్వహించిన వారితో పాటు, ఫిల్టర్ ఇసుకను నిల్వ చేసుకున్న పొలం పట్టాదారులు, మట్టి తవ్వకాలకు సహకరించిన పట్టాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్ఐ మంజుల, వీఆర్ఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేస్తున్న అధికారులు

పురాతన విగ్రహం లభ్యం

పునాది తవ్వుతుండగా వెలుగులోకి..

ఇబ్రహీంపట్నం: కూల్చివేసిన ప్రహరీని తిరిగి నిర్మించేందుకు పునాది తీస్తుండగా పురాతన రాతి దేవతా విగ్రహం లభ్యమైంది. ఈ సంఘటన శనివారం ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల ఆ భవనాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపడుతున్నారు. దీని పక్కనే భూలక్ష్మి ఆలయం ఉంది. తహసీల్దార్ కార్యాలయం ప్రహరీని సరిచేసి పక్కనే ఉన్న భూలక్ష్మి అలయం ముందు భాగం స్లాబ్ వేసేందుకు కూలీలు పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం ప్రహరీని కూల్చి కొత్తగా గోడను నిర్మించేందుకు పునాది తీస్తున్నారు. ఈ క్రమంలో పురాతన రాతి విగ్రహం బయటపడింది. ఆకారాన్ని బట్టి లక్ష్మి విగ్రహంగా ఉందని చెబుతున్నారు.

విగ్రహాన్ని పరిశీలించిన తహసీల్దార్, ఆర్ఐ

పురాతన రాతి దేవతా విగ్రహాన్ని తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐలు పుష్పలత, కృష్ణ పరిశీలించారు. పురావస్తుశాఖ నిపుణులు పరిశీలిస్తే ఈ విగ్రహం ఏ కాలం నాటిదో తెలుస్తుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విగ్రహాన్ని భూలక్ష్మి ఆలయం ఎదుట తాత్కాలికంగా ఉంచారు.



పునాది తవ్వుతుండగా బయటపడిన పురాతన విగ్రహం





గన్ పార్కులో..

విచారణ జరిపించాలి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని తెలంగాణ జన సమితి డిమాండ్ చేసింది. శనివారం టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో గన్ పార్కులోని అమర వీరుల స్తూపం వద్ద దీక్ష చేపట్టారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలంటూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థులు, నిరుద్యోగులు నిరసన ర్యాలీ చేపట్టారు.